# పన్ను వసూళ్లు ముమ్మరం..

**ఇంటి పన్ను @ 61.75 శాతం**

పన్ను వసూలులో రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా




- జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న ఇంటి పన్ను వసూలు
- ఈ ఏడాది పన్ను వసూలు లక్ష్యం రూ.32.38 కోట్లు
- ఇప్పటివరకు వసూలైనది రూ.19.99 కోట్లు
- వచ్చే ఏడాది మార్చిలోపుగా పూర్తి లక్ష్యాన్ని చేరేలా కార్యాచరణ
- గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులకు మరింత ఊతం ఇస్తున్న ఇంటి పన్ను ఆదాయం

రంగారెడ్డి, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నది. వచ్చే ఏడాది మార్చిలో ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో అధికారులు లక్ష్యాన్ని చేరే దిశగా కృషిచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో 558 గ్రామ పంచాయతీలుండగా 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.32.38 కోట్ల ఇంటి పన్ను పంచాయతీలకు సమకూరాల్సి ఉన్నది. ఆరంభంలో ఇంటి పన్ను ప్రక్రియ వేగవంతంగా సాగినప్పటికీ మధ్యలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పన్ను వసూలుకు బ్రేక్ పడింది. ఎలక్షన్లు ముగియడంతో అధికారులు మళ్లీ పన్ను వసూలుపై దృష్టి సారించారు. ఈ క్రమంలో ఇప్పటివరకు రూ.19.99కోట్లు(61.75 శాతం) ఇంటి పన్ను వసూలు అయి రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. పన్నుల చెల్లింపులపై అధికారులు కల్పిస్తున్న అవగాహనతో ప్రజలు చైతన్యవంతులై పన్నుల చెల్లింపునకు ముందుకు వస్తున్నారు.

### బకాయిలు రూ.12.38 కోట్లు

రంగారెడ్డి జిల్లాలోని 27 మండలాల పరిధిలో 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 2,86,420 గృహ యజమానుల నుంచి ఇంటి పన్నును వసూలు చేయాల్సి ఉన్నది. ఈ ఏడాది రూ.32,38,83,926 ఇంటి పన్ను వసూలును ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్నది. డిసెంబర్ 10 నాటికి రూ.19,99,89,657 పన్ను వసూలైంది. ఇంకా రూ.12,38,94,269ల బకాయిలు రావాల్సి ఉన్నది. మూడు నెలలకు పైగా గడువు ఉండడంతో పంచాయతీ పాలకవర్గాలు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయి.

### బాధ్యతగా పన్నుల చెల్లింపు

ప్రభుత్వం చేపడుతున్న పన్ను వసూలుకు పల్లెవాసులు సైతం మద్దతుగా నిలుస్తున్నారు. గ్రామాభివృద్ధిలో ఇంటి పన్ను కీలకపాత్ర పోషిస్తుండగా.. పన్నులు చెల్లించడం ద్వారా పంచాయతీల అభివృద్ధిలో తమవంతు పాత్రను పోషిస్తున్నారు. గతంలో గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా వంటివి అధ్వానంగా ఉండడంతో పన్నులు చెల్లించేందుకు యజమానులు ముందుకు రాకపోయేవారు. కానీ.. గత పదేండ్లలో పల్లెల్లో వచ్చిన గణనీయమైన మార్పుతో ఇంటి పన్ను చెల్లించేందుకు చొరవ చూపిస్తున్నారు. పంచాయతీల ఖజానాలో సరిపడా నిధులు ఉన్నప్పుడే కావాల్సిన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్న విషయాన్ని ప్రజానీకం గుర్తెరిగి అందుకనుగుణంగా వ్యవహరిస్తున్నది. మరోపక్క పన్ను చెల్లింపులపై అధికారులు అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు. దీంతో ఒకప్పటిలా గాకుండా గ్రామాల్లో పన్ను చెల్లింపుదారుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తున్నది.

### గడువులోగా లక్ష్యాన్ని సాధిస్తాం

**– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి**

ఈ ఏడాది లక్ష్యంలో పన్ను వసూలు సగం శాతం దాటింది. పన్నులను రాబట్టడంలో సంబంధిత అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషించడం వల్లనే ఇది సాధ్యపడింది. పన్ను వసూళ్లలో ఏ పంచాయతీ వెనుకబడి పోయిందో గుర్తించి ముందుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి లక్ష్యాన్ని చేరుకునేలా పటిష్ట కార్యాచరణను అమలుచేస్తున్నాం.

# వంద శాతమే.. లక్ష్యం




- ఎస్సెస్సీలో వంద శాతం ఉత్తీర్ణతకు సన్నాహాలు
- 'లక్ష్య' పేరుతో ప్రత్యేక కార్యాచరణ
- నవంబర్ నుంచి ప్రత్యేక తరగతులు
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 10 వేలమందికి పైగా విద్యార్థులు



బొంరాస్‌పేట, డిసెంబర్ 8 : జిల్లాలో ఈ విద్యా సంవత్సరం ఎస్సెస్సీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఉత్తమ ఫలితాలను సాధించడానికి ఈ ఏడాది ఆగస్టులోనే 'లక్ష్య' పేరుతో ఒక కార్యక్రమానికి విద్యాశాఖ రూపకల్పన చేసింది. సబ్జెక్టులవారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన ప్రత్యేక కరదీపికలను రూపొందించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభ్యాస దీపికలను అందజేసింది. విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేసి అర్థవంతమైన అభ్యాసాలు చేయించి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. బట్టీ విధానానికి దూరంగా మైండ్ మ్యాపింగ్ ద్వారా విద్యార్థి తన సొంత మాటల్లో రాసేలా స్వీయ రచన చేసేలా ప్రోత్సహిస్తారు. దీంట్లో భాగంగా సగం రోజులు బోధనకు, మిగతా సగం రోజులను పరీక్షల సన్నద్ధతకు కేటాయించారు. వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న వార్షిక పరీక్షలకు విద్యార్థులను అన్ని విధాలుగా సిద్ధం చేయాలన్న లక్ష్యంతో విద్యాశాఖ అధికారులు నవంబర్ 14 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు గంటసేపు ప్రతిరోజూ ఒక సబ్జెక్టు చొప్పున విద్యార్థులకు బోధిస్తున్నారు. డిసెంబర్ నెలలో చలి ఎక్కువగా ఉంటున్న కారణంగా చలి తీవ్రత తగ్గిన తరువాత ప్రత్యేక తరగతులను సాయంత్రం పూట కూడా నిర్వహించే యోచనలో విద్యాశాఖ అధికారులు ఉన్నారు. వికారాబాద్ జిల్లాలో 2022-23లో ఎస్సెస్సీలో 59.4 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ విద్యా సంవత్సరం దానిని మరింత పెంచి ఉత్తమ ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారు.

### డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తి

జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు డిసెంబర్ చివరి నాటికి అన్ని సబ్జెక్టుల్లో సిలబస్‌ను పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే చాలా పాఠశాలల్లో 80 శాతం వరకు సిలబస్ పూర్తయినట్లు వారు తెలిపారు. అక్కడక్కడ గణితం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టుల్లో కొన్ని పాఠాలు మిగిలి ఉన్నాయి. వీటిని కూడా డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసి జనవరి నుంచి పునశ్చరణ తరగతులు నిర్వహించనున్నారు. ఫిబ్రవరిలో నిర్వహించే ప్రీ ఫైనల్ పరీక్షలకు, మార్చిలో నిర్వహించే వార్షిక పరీక్షలకు విద్యార్థులను అన్ని విధాలుగా సంసిద్ధులు చేయడానికి విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో నిర్వహించినట్టుగానే ఈ ఏడాది కూడా ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో ఒక్కో సబ్జెక్టుకు ఒక పేపర్‌తో మాత్రమే పరీక్షలు నిర్వహిస్తున్నారు.

### ఉపయోగపడుతున్న బ్రేక్‌ఫాస్ట్ స్కీం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ అమలు చేస్తున్న సీఎం అల్పాహారం పథకం, రాగిజావ పథకం పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడుతుంది. ఉదయం ప్రత్యేక తరగతులకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులు పాఠశాలల్లో అందించే అల్పాహారం, రాగిజావ తీసుకుని హాజరవుతున్నారు. గ్రామాల నుంచి ఉదయం పూట ఖాళీ కడుపుతో పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో సీఎం అల్పాహార పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే.

### పరీక్ష రుసుము చెల్లించాకే స్పష్టత రానున్న విద్యార్థుల సంఖ్య

వికారాబాద్ జిల్లాలో ఈ విద్యా సంవత్సరం ఎస్సెస్సీ వార్షిక పరీక్షలకు పది వేల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉంది. జిల్లాలోని 176 ఉన్నత పాఠశాలల్లో 8430 మంది విద్యార్థులుండగా.. మాడల్ స్కూళ్లు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో మరో రెండు వేల మంది విద్యార్థులుంటారు. వీరిలో వార్షిక పరీక్షలకు పరీక్ష రుసుము ఎంతమంది చెల్లించారో తేలితే వార్షిక పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య కచ్చితంగా తెలుస్తుంది.

### మెరుగైన ఫలితాల సాధనకు కృషి



జిల్లాలో ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో మెరుగైన ఫలితాలను సాధించడానికి కృషి చేస్తున్నాం. ఉత్తమ ఫలితాల సాధనకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే 'లక్ష్య' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. ఏ రోజు ఏ పీరియడ్ చెప్పాలో ఆదేశాలు ఇచ్చాం. నవంబర్ నుంచి ప్రత్యేక తరగతులు కూడా ప్రారంభించాం. డిసెంబర్ చివరి నాటికి అన్ని పాఠశాలల్లో సిలబస్‌ను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం. జనవరి, ఫిబ్రవరి నెలల్లో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తాం. డిసెంబర్ తరువాత చలి తగ్గితే సాయంత్రం కూడా అరగంట ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్న ఆలోచన చేస్తున్నాం. పాఠశాలల్లో అందజేస్తున్న అల్పాహారం, రాగిజావ కూడా పది విద్యార్థులకు ఎంతో ఉపయోకరంగా ఉంటున్నది. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని పదిలో మంచి ఫలితాలు సాధించాలి.

**- రేణుకాదేవి, డీఈవో, వికారాబాద్**

## బీఎస్సీ-హార్టికల్చర్ ప్రవేశపరీక్షలో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు సాధించిన సూర్య



కులకచర్ల, డిసెంబర్ 10 : కులకచర్ల మండల పరిధిలోని చెల్లాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని సూర్య బీఎస్సీ-హార్టికల్చర్ ప్రవేశ పరీక్షలో తెలంగాణ రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు సాధించింది. చెల్లాపూర్ గ్రామానికి చెందిన పేద విద్యార్థిని సూర్య ఆదిలాబాద్ ఉద్యాన పాల్‌టెక్నిక్ కళాశాలలో రెండు సంవత్సరాల డిప్లొమా పూర్తి చేసింది. నవంబర్ 25న జరిగిన బీఎస్సీ-హార్టికల్చర్ ప్రవేశ పరీక్ష రాయగా ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. ఈ పరీక్షలో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకును సూర్య సాధించింది. విద్యార్థిని సూర్యను ఉద్యాన పాల్‌టెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, కుటుంబసభ్యులు, మండల ప్రజలు అభినందించారు.



కార్తిక మాసం సందర్భంగా ఆదివారం పర్యాటకులు అనంతగిరి అడవిని సందర్శించారు. వన భోజనాల్లో భాగంగా అక్కడే వంటలు చేసుకొని ఆరగించారు. పిల్లలు ఆటలాడుతూ కేరింతలుకొట్టారు.



